# తెగని బంధం

సాయంత్రం అరయిందన్న మాటేగాని. ఎండ తీవ్రం తగ్గలేదు. వేడి గాడ్పులు కొడుతూనే వున్నాయి. పెదిమ లారిపోతున్నాయి. ఎన్ని నీళ్లు తాగినా దాహం మాత్రం తీరటంలేదు. అప్పుడే కోసి తెచ్చిన రెండు కొబ్బరి బొండాల్లో నీటిని కడుపునిండా తాగాడు. ఎదురు రొమ్ము మీద, పొట్టమీద కొబ్బరి నీళ్లు చిందిపడ్డాయి. ఒళ్లు జలదరించింది. ఎంత చల్లగావుంది అనుకున్నాడు సీతయ్య. మెత్తగా సాగిపోయి, నీళ్ళల్లో కరిగిపోయిన భూమి తన శక్తిని ధారపోసి, వరి కంకుల్ని ఆ యేడు దండిగానే యిచ్చింది. ఏటికేడాది సరిపోయేటట్లు ధాన్యాన్ని బస్తాల్లో బిగించి దాచుకున్నాడు. రెండో పంట పెసలు యకరానికి బస్తాకంటే యెక్కువ రాలేదు. ఇక మిగిలిందల్లా గొడ్లకు మేత. వరి గింజలు తాను తీసుకుని, గడ్డిని మాత్రం పశువులకు జాగ్రత్త పరిచాడు. చుట్ట కుదురులాగ తలపాగ చుట్టుకుని, కిర్రు చెప్పులతో పొలం గట్టున సీతయ్య నడుస్తుంటే, సిసలైన రైతంటే యీయనే అని నలుగురు సంతృప్తిగా చూసేవాళ్లు. అయనకు సొంత పొలమంటూ యేమీలేదు. మక్తాకని ఎవరి పొలం తీసుకున్నా, సొంతం మాదిరిగానే వడుంవంచి పనిచేస్తాడు. అందుకనే యెవరడిగినా జంకు లేకుండా చెప్పేస్తాడు ఏడెకరాలుందని అవన్నీ తనవేనని, తానే భూమిని దున్ని, ధాన్యాన్ని పండిస్తున్నాననే

ధైర్యం, తృప్తి, ఆయనకు యెంతైనా సంతోషాన్నిస్తాయి. ఆ భూమే తన ప్రాణం.

ఇంత ధాన్యం యిచ్చిన భూమి, ఎండిపోయి పదును జారింది. వాడి కత్తుల్లా విచ్చుకుని, వెలవెలబోతోంది. దాహమయి తపనపడి పోతోంది. నీటి కోసం నోళ్లు విచ్చుకుని ఆదుర్దాగా పైకి చూస్తోంది. ఆ దాహం యింతా అంతా అని చెప్పటానికి వీల్లేదు. మానవ మాత్రుడు తీర్చేది కాదు. పైన విహరించే మేఘాలే కనికరించి ఒక్కుమ్మడిగా కిందపడితేగాని, భూదేవి దాహం తీరదు. మెత్తటి గడ్డి దుబ్బులుకూడా గిడసబారి ఇనుప రేకుల్లాగ నిలబడి వున్నాయి. సీతయ్య కిర్రు చెప్పులతో ఓసారి సరిహద్దులు చూసుకుని, యింటికి వచ్చి విశ్రమించాడు. ఒళ్ళంతా చెమటలు కారిపోతున్నాయి. గాలి స్తంభించి పోయింది. గవర్నమెంట్ బస్సులు విసురున సీతయ్య యింటి పక్కనుంచే పోతూ వుంటాయి. ఆ బస్సు వచ్చినట్టు గుర్రల్లా దుమ్ము, ధూళి యింతెత్తున లేవటమే! ముక్కులోకి, నోట్లోకి పోయి మనుష్యుల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తూ వుంటుంది. ఆ ఏడు ఎండలు జాస్తి. అంతా తపనపడి పోతున్నారు. వెళ్ళి నీళ్ళల్లో కూర్చోవాలనిపిస్తుంది. పశువులు ఎండిపోయిన చెరువులోకి వెళ్ళి ఆ బురదలోనే దొర్లుతున్నాయి. ఆ పల్లెటూళ్లో పంపులు లేవు. బావులున్నాయి. చుట్టూ చేదలు, బొక్కెన్లు పట్టుకుని తోడే నీళ్లకు అంతేలేదు. మహా తాపంగా వుంది.

ఈ వారం పోతే కాలవలు వదిలిపెడతారను కుంటున్నారు. ఇక తయారివ్వాలి. నారు వెయ్యాలి. నీరు పొయ్యాలి తర్వాత యెన్ని చేస్తే, యింటికి పంట రావటం. సీతయ్యకు వ్యవసాయ మంటే మంచినీళ్ళు తాగటం లాంటిది. అన్నీ కంఠోపాఠమే. అతనికి తెలియని విషయం లేదు. పెద్ద రైతు. పెద్ద కాలవకు నీరు వచ్చే వేళకు చిన్న

కాలవలు రెడీగా వుండాలి. ఈ పంట కాలవలే ముఖ్యం. ఇవే పొలాలకు ప్రాణాల్నిచ్చేవి. దీంట్లోనే జీవితం వుంది. జాతి మనుగడ వుంది. రెండు వాపలు అటూ యిటూ వేసుకుని చిన్న గుడారంలా తయారు చేశాడు. సీతయ్యకు పొలంలో పడుకోవటమంటే తనింట్లో పడుకున్నట్టే! నాలుగు జతల ఎడ్లున్నాయి కేకేస్తే యిట్టే వచ్చి పడతాయి యెన్ని జతలైనా. పొలాన్ని చదును చెయ్యటానికేగా. భూమిని దున్ని, అదుపులోకి తీసుకువచ్చాడు. తడీ పొడి మట్టి, రెండు చేతుల్లోకి తీసుకుని, నా తల్లి నా తల్లి అంటూ తన నెత్తిమీద పోసుకున్నాడు. ఓనాడు యిలాంటి పొలంలో కలిసిపోవాల్సిందేగా అన్నట్టు!

జన సమూహం మెల్లిగా చేరుకుంటుంది, మనుష్యులు మళ్ళా పొలం మీదికి వచ్చి పడుతున్నారు. బస్తీకి వెళ్ళి బావుకుందామనుకున్న పెద్ద మనుష్యులు కూడా చల్లగాలి తిరగంగానే పొలం దగ్గరకు వస్తున్నారు. పొలాన్ని నమ్ముకున్నవాడు చెడిపోడు, చెడిపోయిన వాడిని భూదేవి ఆదరిస్తుంది. ఓదారుస్తుంది. ఇంత కడుపు నిండా తిండి పెడుతుంది. పొలమంటే అంత అండ! ఎండి మొండయిన చెట్లన్ని కొత్త తొడుగులు వేసుకుంటున్నాయి. గట్టిపడ్డ నేల మెత్తవుతుంది. పొడిగాలి తడిబారుతోంది. ఎండ తీవ్రత అందరూ యిట్టే మరిచిపోతున్నారు. పనులు చేస్తుంటే బాధ కనిపించదు. లాకు లేత్తారు. నీళ్లు విరజిమ్ముకుంటూ వస్తున్నాయి, మెట్ట పల్లాలు సమానమయి పోతున్నాయి. భూమి లోపలికి నీరు చొచ్చుకుపోతోంది. అంతా నీటిమయమే! బురద, తడి, వాన. భార్య రుక్మిణి యింత ఉడకేసి పెడుతుంది. కాయగూరలకు కరువులేదు. చెరువు నిండేటప్పటికి చేపలకు కరువులేదు. అదే అన్నం. అవే కూరలు. అదే వంట అదే చెయ్యి. ఏటేటా తనకున్న అనుభూతే తిరిగి పొందుతూ వుంటాడు.

మార్పులేని జీవితం. ప్రతియేడూ కొత్తగానే కనిపిస్తుంది! ఆ అన్నం తింటూ, ఆ కూరలు రుచి చూస్తుంటే అబ్బ యెంత బాగున్నాయి అనిపిస్తుంది! నిజంగా మనిషికి యింక కావాల్సిందేమిటి! తన తాత తన తండ్రి. యీ పొలం చేసే యిక్కడ మట్టయిపోయారు. తానూ అంతే; ఆ నాగళ్ళు, ఆ ఎడ్లు, ఆ మనుష్యులు అంతా కొత్తే! పాతలో కొత్తదనం!

రాత్రిళ్ళు మరీ చల్లగాలి వీస్తోంది. రుక్మిణి దగ్గర చేరి కబుర్లు చెపుతూ వుంటే, ఆయనకు ప్రాణం ఎంతో హాయి అనిపించింది. ఇన్నేళ్ళ నుంచి భర్త గర్వాన్ని, గౌరవాన్ని, మౌనంగా పంచుకుంటూ ఇంటిపట్టున వుంటోంది. ఎప్పుడైనా పొలం చూట్టానికి వెళ్ళటమే. అంతకు మించి పొలం పనులలో జోక్యం కలుగజేసుకోదు. మిగతా రైతు కుటుంబాల్లో అట్లా కాదు. అంతా నడుం వంచి తలొక పని చేసుకుంటూ పోతారు. వాళ్ళంతా కూడా తప్పక పొలం పనులు చెయ్యాలని, వాళ్ళ విధి అని అనుకుంటూ వుంటారు. కాని సీతయ్య కుటుంబంలో అట్లా కాదు. ఆడవాళ్ళు పొలం పనులలోకి వెళ్ళక పోవటమే గౌరవం, మర్యాదా అని భావిస్తారు! ఎవరి పనులు వాళ్ళు చెయ్యక పోవటంలో కూడా గౌరవం వుంటుందేమో! అయితే మోతుబరుల యిళ్ళల్లో ఆడవాళ్ళు బైటకు రాకపోవటం కూడా ఒక గౌరవమే! సీతయ్య కొడుకులిద్దరూ చదువుకున్న వాళ్ళు. పెద్దవాడు పట్నంలో ఉద్యోగం చేస్తున్నాడు. మూడో సంతానం ఆడ పిల్ల. అట్టే వయస్సు లేదు. ఆ ఊళ్ళోనే బళ్ళో చదువుతోంది. నాట్లయిపోయినాయి. నిశ్చింతగా కొన్నాళ్ల పాటు కూర్చోవచ్చు. ముసురు పట్టింది కూడా. కాలవ నీళ్లతో పొలాలు నిండిపోయిన యేడు వర్షం మహా జోరుగా వస్తుంది. కాలవలకు నీరు ఆలస్యంగా వచ్చిన యేడు, మేఘాలు

కూడా బద్దకిస్తాయి. గోతుల్లోనూ, నూతుల్లోనూ నీటిని తీసుకువచ్చి నారును తడపాలసి వస్తుంది ఇది సీతయ్యకు బాగా అనుభవమే. ఈ వర్షం చూసి, అవన్నీ జ్ఞాపకం తెచ్చుకుంటున్నాడు.

'ఏమిటి యీసారి కోడలు పిల్ల రుసరుసలాడుతోంది' ....అన్నాడు సీతయ్య.

'ఏముంది మామూలే....మనం వచ్చి, వాళ్ల దగ్గరుండాలట! ఎన్నిసార్లు చెప్పినా మీరేమొ రారు' అంటుంది.

సీతయ్య పెద్ద పెట్టున నవ్వాడు.

'మన మీద వాళ్ళకున్న ప్రేమ అలాంటిది. అంతే....అంత కంటె యింకేం తెలీదు' అన్నాడు....

'ఏడాది పొడుగునా పొలం పనులు పెట్టుకు కూర్చుంటె యెలా!.... ఓసారి వెళ్ళొద్దాం....' రుక్మిణి ఏమంటావు అన్నట్టు భర్త మొహంలోకి చూసింది.

'వెళ్లటానికేముంది, ఎప్పుడైనా వెళ్ళచ్చు........అయితే వెళ్లినంత సేపు పట్టదు తిరిగి రావటానికి. ఆ పట్నంలో నేనేం వుంటాను. ఉక్కిరిబిక్కిరయి చచ్చిపోను!....' ఆయనకు యింట్లో భోంచెయ్యట మంటేనే గిట్టదు. పొలానికే అన్నం తెప్పించుకుని, అక్కడే తింటూ వుంటాడు. తప్పని సరి అయితేనే యింట్లో వుండటం. రోజు రోజుకు వరినారు ఎంతవరకు వచ్చిందో చూడాలి. కలుపు తియ్యటం ఓనాటితో వూర్తికాదు. చివరిదాకా ఆయన కళ్లు వరి చేను మీదే వుంటాయి. ఏదో పని చేస్తున్నట్టే కనిపిస్తాడు. వరి మొక్క నాటిన నుంచి, పైరు మొక్క కోసేదాకా, యెంతో జాగ్రత్తగా, ప్రేమగా పెంచాలని అంటూ

వుంటాడు. అంత ప్రేమ, శ్రద్ధ పొలం మీద లేకపోతే, పొలానికి మనమీద కూడా అంతంత మాత్రమే వుంటుంది అని అతని అభిప్రాయం. నారు గట్టిపడింది. నిటారుగా నిలబడటం కాస్త పొడుగు సాగటం చూస్తూ చూస్తూ లోపల లోపల యెంతో ఆనందపడి పోతాడు. కంకులు వెయ్యటం మొదలు పెట్టినప్పటినుంచి, ఆయనకు బాధ్యత మరీ యెక్కువయినట్టు భావిస్తాడు. నీరు సరిగ్గా వుందో లేదో చూడాలి. పుష్టిగా ధాన్యం పట్టేలాగున చూడాలి. ఇప్పుడే మహా కష్టం, అన్ని వైపుల్నుంచి "శత్రువులు" దాడిచేస్తూ వుంటాయి. కీటకాలు, పక్షులు, ఎలుకలు, ఒకటేమిటి, అన్నీ వచ్చి పడతాయి. ఎవరి పొట్ట తాపత్రయం వాళ్లది!

చలి విదిలించేస్తోంది. ఇన్నాళ్ళు కష్టపడింది ఫలితానికి వచ్చేస్తోంది. ఇప్పుడు మహా ఓపిక పట్టాలి. పొలం దగ్గరే, కాపలాగా పడుకోవాలి. కష్టపడి సంపాదించిన సొమ్మును యిట్టే సునాయాసంగా కాజెయ్యాలని ఎంతోమంది ఎదురుచూస్తూ వుంటారు, మనం కష్టపడటమే కాదు, దాన్ని దక్కించు కోవటానికి కూడా కష్టపడాలి అంటాడు. రోజూ సీతయ్య ఒక్కడే పొలం దగ్గర వెళ్లి పడుకుంటుంటే రుక్మిణికి మనస్సు ఎలాగో వుంటుంది. తానా చేసేపని కాదు, భర్తను వద్దంటానికా వీల్లేదు. అయితే సీతయ్యకు అలసట, శ్రమ అన్న మాటేలేదు. పొలం దగ్గర పడుకోవటమనేది ఆయనకు యెంతో శాంతిని, తృప్తిని యిస్తుంది. తన చేతుల్తో ధాన్యాన్ని యింటికి తీసుకువచ్చేదాక ఆయనకు తోచదు. ఇంకో పనిలో, ఆయన మనస్సు జొరపడదు. ఇక యిప్పుడు రుక్మిణి చెయ్యవలసిందల్లా ఆయనకు కావలసిన వేమిటో చూడటమే. అవును ఏడాది పొడుగునా మాత్రం యింతకంటే చేసేదేముంది. అడపిల్లను మాత్రం యిద్దరూ అల్లారు ముద్దుగా పెంచుకుంటు

న్నారు. ఆ పిల్లచేత యేపనులు చేయించరు. పొద్దున్నే లేవంగానే బడి హైమవుతుంది. ఆదరబాదరగా తయారయి. యింత చద్ది అన్నం. మీగడ పెరుగు వేసుకుని తింటుంది. ఇక బళ్ళోకి వెళ్ళిపోతుంది. తన బడేమిటో, తన ఆటలేమిటో అంతే! ఇంకో మాట తెలీదు. పొలం సంగతి ఐతే బొత్తిగా అర్థం కాదు. మా అయ్య పొలంలోకి వెళ్లి వడ్లు తీసుకొస్తాడు. మా అత్త, అమ్మ, దంచి బియ్యం చేస్తారు. మేమంతా అన్నం వండుకుని తింటాం అంటుంది. ఇంతకంటె తెలియాల్సిందే మిటి! నిజమంతేగా మరి!

కోతలయిపోయినాయి. గాదెల మీదే ధాన్యం లెక్క సీతయ్యకు తెలుస్తుంది. సంతృప్తిగా పొలం సరిహద్దులు నాలుగు వైపులా చూశాడు. మధ్యలో నిలబడి, రెండు చేతులతోనూ మట్టిని తీసుకుని కళ్ళకు అద్దు కున్నాడు. చల్లగా చూశావమ్మా. మమ్మ న్న అంటూ నమస్కారం చేశాడు. ఈ ఏడుతో రెండో అబ్బాయి బి. యస్. సి. పూర్తి అవు తుంది పరీక్షలు అవగానే. ఏదో ఉద్యోగంలో ప్రవేశపెట్టాలి. ఇక పిల్ల పెళ్లి ఇవ్వాళ కాకపోతే, రేపైనా చెయ్యాల్సిందేగా! ఈ రెండే ఆయన బాధ్యతలు. తర్వాత నిశ్చితంగా ఏమీ చీకూచింతా లేకుండా ప్రశాంతంగా వుండిపోగలడు. కాస్తంత సమయం చిక్కినప్పుడల్లా యీ రెండు విషయాలే ఆలోచిస్తాడు.

కుప్పలు వేశారు. దగ్గరుండే అజమాయిషీ చేశాడు ఎకరానికి పదిహేడు బస్తాలు పండాయని అంచనా. పొలం గల వాళ్ళకి. యిచ్చే దేమిటో యిచ్చేస్తే, తన వాటా పది ఎకరాలమీద డెభ్బై బస్తా వస్తుంది. బస్తా అక్కళ్ళ ముప్పయి రూపాయల దాకా పలుకుతుంది. పొట్టకు పుట్టెడు లెక్క తిండి గింజలు అట్టే పెట్టుకుని. మిగతావి అమ్ముకుంటే,

ఖర్చులుపోను యీ యేడు పన్నెండు వందలు వస్తుంది. ఈ విధంగా అప్పటి కప్పుడే లెక్కలు వేసుకుంటున్నాడు.

"ఈ ఏడు ఎంత పండిందనుకున్నావో తెలుసా!...." దీమాగా అన్నాడు యింట్లో 'కొత్తేముంది....మామూలేగా!....'

'కాదు....ఇంకా అయిదు బస్తాలు యెక్కువొస్తాయి....'

'ధాన్యం కొట్టందే అప్పుడే యెట్లా!....'

అదే సీతయ్య గొప్ప!.... 'ఏంటివ్వాళ్ళ అన్నంలోకి....'

రుక్మిణి నవ్వింది సీతయ్య గ్రహించాడు. ఏడాదికొక సారైనా, కోడిమాట జ్ఞాపకం చేసుకోకపోతే, సుష్టుగా భోంచేసినట్టే వుండదు! కోడిపుంజులు నాలుగు, పెట్టలు రెండూ వున్నాయి, గుడ్లు తెగపెడు తోంది. ఇంటి నిండా కోడిపిల్లలే. 'ఈ సంతానం బాగానే వుంది' అన్నాడు సీతయ్య.

'ఏమో వెంకటేశ్వరస్వామి దయవల్ల, యీ యేడన్నా, నేను తాతమ్మనవుతానో లేదో!....' రుక్మిణి అదోలాగ చూసింది.

'ఊ!....' ఆలోచనగా లేచి నిలబడ్డాడు. వాకిట్లో బల్లమీదికి వచ్చి కూర్చున్నాడు. ఆ బజారున పోయే ప్రతివ్యక్తీ, సీతయ్యను చూసి దణ్ణమయ్యా అని పోవల్సిందే!

పొద్దువాలే సమయం. పశువులు యింటి మొహం పట్టినాయి. పగలల్లా పనిచేసిన శ్రమజీవులు బరువుగా యిళ్ళకు చేరుతున్నారు. చల్లటి గాలి విసురున వీస్తోంది. చివరి బస్సు రయ్‌మని యింతెత్తు

దుమ్మును పైకెత్తేసి దూసుకు పోయింది. పిల్లలు ఏలికి గజగజలాడు తున్నారు. దూడల్ని వదిలేసి, పాలకోసం, గేదెల వైపు, బిందెలు తాళ్ళూ పట్టుకుని ఎదురుచూస్తున్నారు. నిజంగా దూడలే పాలు తాగు తున్నాయని గేదెలు పాలిస్తాయి. వాటిని కడుపునిండా అంతా తాగుతారు. పశువుల్ని మోసం చేసినా ఫరవాలేదు. నోరు లేని జీవాలు. ఏమీ చెప్ప లేవు ఏమీ తెలుసుకోలేవు. అయితే మానవుడు మానవుని మోసం చెయ్యటమంటే మాటలు కాదు. అంత సాహసించిన వాడు, అన్నింటికీ తెగించే వచ్చి వుంటాడు. లేకపోతే సీతయ్య దగ్గరుండి, వేయించిన కుప్పలో దొంగ తనం జరగటమే!

వెంకటసామి పరుగెత్తుకుంటూ వచ్చి చెపితే, సీతయ్య నవ్వి వూరుకున్నాడు. 'బావ బావమరుదులు, ఆ మాత్రం నువ్వు పరిహాసం చెయ్యకపోతే యెట్టా! ...' అని వూరుకున్నాడు సీతయ్య.

వెంకటసామి గట్టిగానే అన్నాడు నేను చెప్పేది నిజమే. 'కావ లిస్తే, నాతోరా....చూపిస్తా' అన్నాడు.

సీతయ్య ఉగ్రుడయి పోయాడు. కాస్తంత ధాన్యం పోయి నందుకు కాదు. ఇది పరువు ప్రతిష్టలకు సంబంధించిన విషయం. సీతయ్య కుప్పనే దోచుకు పోయారు అని యెవరైనా అంటే అతనికి యెంత తలవంపులు! అభిమానం గట్టిగా దెబ్బతిన్నది. చివాలున నవ్వేశాడు బిర్రుగా తలపాగ చుట్టేసుకున్నాడు. కిరు చెప్పులు తొడు క్కున్నాడు. కర్ర తీసుకున్నాడు. వంటి మీద బనీను మాత్రమే వుంది. ఎప్పుడూ పై గుడ్డలేందే సీతయ్య బైటికిరాడు. ఇవ్వాళ ఆయన నడక తీరు, వాలకం చూస్తుంటే, అందరికీ హడలు పుట్టిపోయింది. ఏమిటంత తీవ్రంగా సీతయ్య వెళుతున్నాడు, ఎక్కడికి, ఏమి జరిగింది,

అనే ప్రశ్నలే అందరి నోట్లోనూ నలుగుతున్నాయి. కారణం ఏమిటో ఆ నోటా ఆ నోటా పాకిపోయింది. సీతయ్య తీరా కుప్పల దగ్గరికు వెళ్ళేటప్పటికి. జనం గుమిగూడి వున్నారు ఆయనేం చేస్తాడో చూద్దామన్నట్టు! కుప్పలన్నీ ఒకటొకటే చూశాడు. కళ్ళెర్ర చేసినాడు. కళ్ళెర్ర చేసి నాలుగు వైపులా భీకరంగా చూశాడు.

'ఈ బోదెలు తీసిన వాడెవరో నా దగ్గరకు వచ్చి క్షమాపణ వేడుకుంటాడా సరేసరి. లేకపోతే వాడినేం చేస్తానో!....' గద్దించాడు సీతయ్య.

అందరి గుండెలు అదరిపోయినాయి ఏ మహాయిత్యం చేస్తాడోనని. ఒకరి మొహాలు ఒకరు చూసుకుంటున్నారు. ఇంతలోకి జనాన్ని తోసుకుంటూ ఓ వ్యక్తి గబగబ వచ్చి, సీతయ్య కాళ్ళమీద పడ్డాడు.

'అయ్యా. యివి మీ కుప్పలనుకోలేదు....' అంటూ ప్రాధేయపడ్డాడు. 'అయితే యింకోళ్ళ కుప్పలవుతే. తీసుకో వచ్చునా!....' గర్జించాడు.

అతనేమీ మాట్లాడలేదు. చేతులు జోడించి, ఆయన కెదురుగా నిలబడి వణికిపోతున్నాడు.

'అయ్యా యికెప్పుడు చెయ్యను....' ప్రాధేయ పడ్డాడు.

ధీమగా తల ఊగిస్తూ, 'నీ కెప్పుడైనా కావాలంటే, మా యింటికొచ్చి అడుగు.... నేనిస్తా!....ఇలాంటి పనులు మాత్రం చెయ్యక....' అభయ మిచ్చాడు సీతయ్య.

అందరి ఆవేశాలు చల్లారినాయి, ఆ ఊరికంతా సీతయ్యే పెద్ద

అందగా కనబడుతున్నాడు. అదివరకు కంటే యెన్నో రెట్లు ఆయన మీద గౌరవం, భక్తి ఎక్కువయినాయి.

రోజులు గిర్రున తిరుగుతున్నాయి. రెండో అబ్బాయి పరీక్ష ప్యాసయ్యాడన్న మాటేగాని, ఉద్యోగం చెయ్యనంటాడు. తండ్రితో పాటు, తాను కూడా పొలం పనులే చూసుకుంటాడట.

రుక్మిణికి మాత్రం సుతరాం యిష్టంలేదు. సీతయ్యకు మాత్రం లోపల లోపల సంతోషమే. రామయ్యైనా తన దగ్గరుంటూ పొలం పనులు చూసుకుంటాడని. ఇంత చదువు చదివిందీ, నాగలి పట్టటానికేనా అంటుంది తల్లి. భార్యకు అర్థమయ్యేటట్లు చెప్పటం సీతయ్యకు చేతకావటం లేదు.

రోజులు దొర్లిపోతున్నాయి. ముసలితనం బరువుగా వచ్చి పడింది సీతయ్య వంటిమీదకు, వడుములు పట్టేసినాయి. చేతులూ, కాళ్ళూ స్వాధీనం తప్పినాయి. బాగా దగ్గరకొస్తేగాని మనుష్యుల్ని పోల్చుకోలేక పోతున్నాడు. చిరాకు యెక్కువయింది. మరీ మంచం లోంచి లేవలేక పోతున్నాడన్న తర్వాత, పట్నం నుంచి పెద్ద కొడుకు నాంచారయ్య భార్యను వెంటపెట్టుకు వచ్చాడు. నలుగుర్నీ చూస్తూ ఆవేదన పడుతున్నాడు. ఏమేమిటో చెప్పాలని, సీతయ్య ఆరాటపడుతున్నాడు. దిగాలపడి కూర్చుంది రుక్మిణి. ఎవరు పిలిచినా పలకటం లేదు. ఆ ఆడపిల్ల మాత్రం, లోపలికి వెళ్ళి వెక్కి వెక్కి ఏడ్చి, కళ్ళు తుడుచుకుని బైటకు వస్తూ వుంటుంది. ఆచార్యులు వచ్చి చూసి పోయాడు, అన్ని రోగాలకు మందులున్నాయి. కాని ఆయుర్దాయానికి ఎవ్వరూ కర్తలు కారు. ఎవ్వరూ కూడా చావును తప్పించుకోలేరు. ఆ ఘడియను యింకా కొన్నాళ్ళు దాటటానికి ప్రయత్నించవచ్చు.

సీతయ్య విషయంలో యిదే జరుగుతోంది. జ్వరం తీవ్రత కూడా యెక్కువగానే వుంది. అంతిమ ఘడియ రాబోతున్నట్లు సీతయ్య గ్రహించి వట్టున్నాడు. మెల్లిగా, నులక కుక్కిలోంచి లేచి కూర్చు న్నాడు, నాలుగువైపులా చూశాడు. పెదిమలు తడబడుతున్నాయి. తానీ మధ్యనే కొన్న రెండు యకరాల భూమి కళ్ళల్లో మెరిసింది.

'పొలం కాడికి తీసుకు పోండి.........అన్నాడు' సీతయ్య ఆయాస పడుతూ. ఆయన కళ్ల వెంబడి కారుతున్న నీళ్ళను రుక్మిణి ఒక్కతే చూడగలిగింది. రెండెడ్ల బండీలో ఆయన్ను పడుకోపెట్టారు, వెన కాలే ఊరు ఊరంతా కదిలింది. తన సొంత పొలంలో అడుగు పెట్టాడు. తాను కష్టించి సంపాదించిన పోలం ఆవరణంతా సంతృప్తిగా చూసి చతికిలపడ్డాడు.

'అయ్యో!....' అంటూ ఆవురుమంది ఆడపిల్ల. ఎవ్వరికీ దుఃఖము ఆగలేదు.

'మాకు ఎంతో అండగా వుంటున్నాడు....' ఒకాయన మాటలు చప్పరించాడు. కొడుకులిద్దరు పెద్ద పెట్టున ఏడుస్తున్నారు. రుక్మిణి బొమ్మలాగ కూర్చుండిపోయింది.

చేతులతో సీతయ్య సంజ్ఞ చేశాడు దగ్గరకు రమ్మని. కొడుకు లిద్దరు దగ్గరకు వచ్చి, తండ్రి కాళ్ళ దగ్గర కూర్చున్నారు.

'....మీ అందరూ....కూడా....నిన్నె....నువ్వు కూడా....రా.... నన్నెంతో అభిమానించారు....నేనంటే....మీకు ప్రేమ భక్తి....అన్నీ వున్నాయి....నా ధీమా ఏమిటి!.........నా అండ ఏమిటి!....ఇదిగో యీ భూ మాతే! ...నేను పోతున్నా! ...మన అమ్మను నమ్ముకోండి....మీకు

యే లోపం వుండదు....ఇదే మీకు రక్ష!....' అంటూనే రెండు చేతు ల్లోనూ, రెండు గుప్పెళ్ల మట్టి తీసుకుని, నెత్తిమీద పోసుకున్నాడు. అంతే! సీతయ్య భూదేవి ఒడిలోకి ఒరిగి పోయాడు.

తండ్రి వదిలిపెట్టి పోయిన నాగలిని, రామయ్య తీసుకున్నాడు. మళ్ళీ అంతా కొత్తే. పాతలో కొత్త దనం. రామయ్య చదువును యింకా యెక్కువ ధాన్యం పండించటానికి ఉపయోగించుకుంటున్నాడు. అయితే మళ్ళీ వర్షాల కోసం ఎదురు చూడటం, నారు ఎండిపోవటం, అదుర్దా పడటం, చివరకు నీళ్ళు రావటం మామూలే! అన్నీ అవరో ధాలే కనిపిస్తాయి. కాని అన్నీ సక్రమంగానే జరిగిపోతూ వుంటాయి. ఈ భూమి బంధాల్నుంచి తప్పించుకుని యెక్కడికో వెళ్ళిపోవాలని మొదట్లో గట్టి పట్టుదల. చదువులు చదివి పట్నాలలో పెద్ద పెద్ద ఉద్యోగాలు చెయ్యాలని తాపత్రయం. ఉద్యోగాలు దొరక్క అసంతృప్తి. అన్నం పెట్టే భూమిని వదిలిపెట్టి అన్నం కోసం అక్కడా యిక్కడా పాకులాడటం, మళ్ళీ ఇక్కడికేవచ్చి పడటం ఆ ఊళ్లో చాలా మందికి అలవాటయిపోయింది. ఎక్కడ వెళ్ళినా, ఏం చేసినా, ఏదో ఓనాడు భూదేవి, తన బిడ్డల్ని మళ్ళీ తనలోనే లీనం చేసుకోక మానదు, ఆమె మమకారం అలాంటిది!

కథా నిలయం
893
శ్రీకాకుళం

( పంచాయతీ. నవంబరు 1965 )